క్లుప్తంగా

17న నిరుద్యోగ నిరాహార దీక్ష

ఖమ్మంరూరల్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద టీ సేవ్ ఉద్యమంలో భాగంగా వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆధ్వర్యాన అఖిలపక్షంతో కలిసి సోమవారం చేపడుతున్న నిరుద్యోగ నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి కోరారు. సాయిగణేష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలోశనివారం ఆయన మాట్లాడుతూ దీక్షకు పాలేరు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

17వ డివిజన్‌లో ఇంటింటికీ టీడీపీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 17వ డివిజన్‌లో శనివారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. పార్టీ నాయకులు వడ్డే విజయ్, తలపనేని జయరాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కూరపాటి వెంకటేశ్వర్లు పాల్గొని ఇంటింటికీ వెళ్లి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అలాగే, ఇటీవల ఆస్ట్రేలియాలో అనారోగ్యంతో మృతి చెందిన ఏపూరి హర్షవర్ధన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు గుత్తా సీతయ్య, వెంకన్న, జి.నాగేశ్వరావు, కందిబండ నరసింహారావు, ఒర్సు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'శెట్టిపల్లి' సేవలు మరువలేనివి

ఖమ్మంసహకారనగర్: విశ్రాంత ఉపాధ్యాయుడు శెట్టిపల్లి సత్యనారాయణ సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. శెట్టిపల్లి సత్యనారాయణ శుక్రవారం మృతిచెందగా.. ఆయన మృతదేహాన్ని మమత ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎం అధికారులతో పాటు పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పునరుద్ధరణ కమిటీకి బాధ్యతలు అప్పగింత

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ దేవాలయానికి నియమించిన పునరుద్ధరణ కమిటీకి శనివారం దేవాదాయ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు నియామకపు పత్రాలు అందించి ఆలయ బాధ్యతలను అప్పగించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షకురాలు సమత, దేవాలయ కార్యనిర్వాహణాధికారి వీవీ నర్సింహారావుల పర్యవేక్షణలో పునరుద్ధరణ కమిటీ బాధ్యతలు చేపట్టి కమిటీ అధ్యక్షుడిగా బచ్చు మురళీకృష్ణను ఎన్నుకున్నారు. పునరుద్ధరణ కమిటీ సభ్యులు గోధుమల శ్రీనివాస్, చల్లా సత్యనారాయణ, ఆకుల మల్లిఖార్జున్, గరినే వికుమార్, గండమళ్ల సంగయ్య, పులిపాటి సంపత్‌కుమార్, మిట్టపల్లి శ్రీనివాస్‌రావు, పిల్లుట్ల మంజుల, రంగరాజు ఊర్మిల పాల్గొన్నారు.

పాలేరు నుంచి సీపీఎం పోటీ..

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం నుంచి సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాద బీజేపీని ఇంటికి సాగనంపటం కోసమే బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ పొత్తుతో పాలేరుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పొత్తులపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎవరికి సీటు ఇచ్చినా పొత్తు ధర్మంను తప్పక పాటించాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, సిరికొండ ఉమామహేశ్వరీ, మారుతి కొండలరావు, భూక్యా కృష్ణ, పాపినేని బాబు, పగిడికత్తుల నాగేశ్వరరావు, భూక్యా కృష్ణ, రాయల రవి, కూరపాటి ప్రసాద్, మండడి కోదండరామారావు, దండా సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

తిరుమలాయపాలెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నిధులతో మండలంలోని పిండిప్రోలు గ్రామ పంచాయతీ శివారు పాపాయిగూడెంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ నామా ప్రసాద్, ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు, వార్డు సభ్యుడు కిరణ్, బీఆర్ఎస్ నాయకులు తాతా రవీందర్, పరికపల్లి చంద్రశేఖర్, జాలా మోహన్‌రావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	రుద్రుడు
ఆదిత్య	శాకుంతలమ్
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

- ఖమ్మంగాంధీచౌక్

ఎండలు.. చల్లగుండ!

భానుడి ప్రతాపానికి తల్లడిల్లుతున్న జనం

- కూలర్లు, ఏసీల వైపు పరుగులు
- కూలర్ల వైపే సామాన్యుల మొగ్గు
- ఏసీల వినియోగానికి పెరిగిన ప్రాధాన్యం
- మార్కెట్‌లో అందుబాటులో వివిధ రకాల మోడళ్లు

సండే స్పెషల్



ఓ కంపెనీ షోరూంలో కూలర్లు, ఏసీ ధరలు తెలుసుకుంటున్న వినియోగదారులు

ఖమ్మంగాంధీచౌక్: భానుడి ప్రతాపానికి ఎండలు మండుతుండడంతో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు ఆపైన నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై 11 గంటల కల్లా ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుతున్నాయి. దీంతో మధ్యాహ్నం వేళల్లో ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కపోత కూడా అధికంగా ఉంది. దీంతో ఇంట్లోని సాధారణ ఫ్యాన్ల ద్వారా వచ్చే గాలి నుంచి ఉపశమనం లభించకపోవడంతో సామాన్యులు మొదలు అన్ని వర్గాల ప్రజలు చల్లదనాన్నిచ్చే కూలర్లు, ఎయిర్ కండీషనర్(ఏసీ)ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎండ తీవ్రతతో కూలర్లు, ఏసీల వినియోగంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

ఉష్ణోగ్రతల నుంచి రక్షణ చర్యలు..

పెరిగిన ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలకు పిల్లలు, వృద్ధులు నీరసించి వారిలో ఉత్సాహం తగ్గుతోంది. అంతే కాక ఇళ్లు, కార్యాలయాల్లో పనిచేసే వారు, కార్మిక వర్గాలు పని ప్రాంతాల్లో ఎండ తీవ్రతకు అలసటపడుతున్నారు. ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ఇళ్లల్లో నీడలు ఏర్పాటు చేసుకోవటం, చల్లదనం కోసం కూలర్లు, ఏసీలను వినియోగించటం వంటి చర్యలు తీసుకుంటున్నారు. సామాన్య ప్రజలు కూలర్ల వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంటే.. మధ్య తరగతి వర్గాలు మొదలు ఉన్నత వర్గాల వారు ఏసీలను వినియోగిస్తున్నారు.



వివిధ కంపెనీలకు చెందిన కూలర్లు



అమ్మకానికి సిద్ధంగా ఏసీలు

ఊపందుకున్న కూలర్ల కొనుగోళ్లు..

ఉష్ణోగ్రతలు పెరగటంతో వివిధ కంపెనీలకు చెందిన కూలర్లు, అసెంబుల్డ్ కూలర్ల విక్రయాలు ఊపందుకున్నాయి. ఇళ్లలో వినియోగించే కూలర్లు రూ. 3,500లు మొదలు బ్రాండ్, స్థాయిని బట్టి రూ. 15 వేల వరకు ఉన్నాయి. ఇక పని ప్రాంతాల్లో వినియోగించే డిసర్ట్ కూలర్ల ధరలు రూ. 30 వేల వరకు ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే కొంత మేరకు ధరలు కూడా పెరిగాయి. ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా నిత్యం వందల సంఖ్యలో కూలర్లు కొంటునట్లు విక్రయదారులు చెబుతున్నారు. పాత కూలర్లను కూడా బయటకు తీసి గడ్డిని(హనీ కోంబ్) కొత్తగా వేసి వినియోగిస్తున్నారు.

ఏసీలకు పెరిగిన ప్రాధాన్యం..

గతంలో ఉన్నత వర్గాల వారు వినియోగించే ఏసీలు నేడు మధ్య తరగతి వర్గాలు సైతం వినియోగించేలా 3 స్టార్, 5 స్టార్ ఏసీలంటూ అంటూ వివిధ కంపెనీలు మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. 3 స్టార్ ఏసీలతో పోలిస్తే 5 స్టార్ ఏసీలకు విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది. అయితే 3 స్టార్ ఏసీల ధరలు కంపెనీని బట్టి రూ. 35 వేల నుంచి రూ. 40 వేల వరకు ఉన్నాయి. 5 స్టార్ ఏసీలు రూ. 45 నుంచి రూ.60 వేల వరకు ధర పలుకుతున్నాయి. షోరూంలు ఏసీలకు రుణ సౌకర్యం కల్పించటంతో మధ్య తరగతి వర్గాలు కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారు. గతంతో పోలిస్తే ధరలు 5 శాతం వరకు పెరిగాయి. విక్రయాలు 25 శాతం పెరిగినట్లు షోరూం యజమానులు చెబుతున్నారు.

కూలర్ కొన్నాను..



ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఇంట్లో ఫ్యాన్ గాలి వేడిగా వస్తుంది. ఉక్కపోతలు కూడా పెరగడంతో పిల్లలు, పెద్దలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో నా కుటుంబం సభ్యులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని చల్లదనం కోసం ఒక కూలర్‌ను కొనుగోలు చేశాను.

– మల్లేశం, పాలేరు, కూసుమంచి మండలం

కొనుగోలు చేసేందుకు వచ్చా..



ఎండ నుంచి ఉపశమనం కోసం కూలర్ లేదా ఏసీని కొనుగోలు చేయాలని ఖమ్మం వచ్చాం. ధరలు చూస్తుంటే ఎక్కువగా ఉన్నాయి. రుణ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. విద్యుత్ వినియోగం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని కూలర్ లేదా ఏసీ కొనుగోలు చేస్తాం.

– మాధవయ్య, మన్నెగూడెం, సీరోలు మండలం, మహబూబాబాద్ జిల్లా

విక్రయాలు పెరిగాయి..



ఉష్ణోగ్రతలు పెరగటంతో ప్రజలు ఏసీలు, కూలర్ల కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫైనాన్స్ కంపెనీలు రుణ సౌకర్యం కల్పిస్తున్నాయి. లక్కీ డ్రాలను కూడా ఏర్పాటు చేశాం. 5 వేల పైన వస్తువులను కొనుగోలు చేస్తే డ్రాలో ఉంటారు. గత ఏడాదితో పోలిస్తే విక్రయాలు బాగా పెరిగాయి.

– రాజు చౌహాన్, మేనేజర్, బజాజ్ ఎలక్ట్రానిక్స్

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించొద్దు



కార్మికులకు సూచనలు చేస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శనివారం ఉదయం నగరంలోని 33, 46 డివిజన్‌లలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించాక మాట్లాడారు. ఇంటి నుంచి సేకరించే తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వేర్వేరుగా సేకరించాలని, లేనిఎడలా సిబ్బందిపై చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. చెత్త సేకరణ ఏ రోజు ఏ డివిజన్‌లో జరుగుతున్నదో ప్రతీ రోజు రిజిస్టర్‌లో నమోదు చేసి డ్రైవర్, జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతకం చేయాలన్నారు. అంతేకాక కాల్వల్లో మురుగు తీసిన సమయంలో అక్కడ ఇంటి యజమానితో సంతకం చేయించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా గ్లౌజులు, బూట్లు ధరించి మాత్రమే పారిశుద్ధ్య పనులు చేయాలని చెప్పారు.

మూడు రోజుల శిక్షణ..

తిరుమలాయపాలెం: మరుగుదొడ్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రత అమలు తీరుపై అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు శిక్షణ నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీఓ జయరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల లోపు ఆన్‌లైన్ ద్వారా కలెక్టర్‌కు హాజరు పంపవలసి ఉంటుందని సకాలంలో శిక్షణకు హాజరు కావాలని తెలిపారు.

ఏ స్థాయికి ఎదిగినా స్వస్థలాన్ని మరవొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ గణేష్

ఖమ్మం సహకారనగర్: విదేశాల్లో విద్యనభ్యసించినా, ఎంత స్థాయికి ఎదిగినా సొంత ప్రాంతాన్ని మరిచిపోవద్దని ఖమ్మం ఏసీపీ గణేష్ అన్నారు. విదేశీ విద్య-2023 పేరుతో వీసా మాస్టర్స్ ఆధ్వర్యాన నగరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశాల్లో చదువుతున్న వారిలో ఎక్కువగా భారతీయులే ఉండగా.. వారు ఉన్నత స్థానాలకు చేరాక ఇక్కడ యువతకు చేయూతనివ్వాలని సూచించారు. కేఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, కార్పొరేటర్ సరిపూడి రమాదేవి సతీష్ మాట్లాడగావీసా మాస్టర్స్ నిర్వాహకులు శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలిక కానరాకుండా పోవడంతో కేసు నమోదైంది. ఇంటర్ చదువుతున్న బాలిక శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఎక్కడ ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవంతి తెలిపారు.

కుట్టు మిషన్లు పంపిణీ

నేలకొండపల్లి: మండలం కేంద్రంలో న్యాక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి శనివారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. గత నెల 16న ప్రారంభమైన శిక్షణ శనివారం ముగియడంతో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ చల్లా వెంగమ్మ చేతుల మీదుగా కుట్టు మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎండీ హసీబ్, పీఎమ్మార్ ట్రస్టు ప్రతినిధి పురుషోత్తమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చీరలు..



చీరలు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నేలకొండపల్లి: వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా క్లబ్ ప్రతినిధులు శనివారం నిరుపేదలకు చీరల పంపిణీ చేశారు. కొత్త సోమశేఖర్, దోసపాటి ఉషారాణి, పసుమర్తి గురునాథం ఆధ్వర్యాన ఐదుగురి చొప్పున మొత్తం 15 మంది నిరుపేదలకు చీరలు, పసుపు, కుంకుమ, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గెల్లా వెంకటరమణ గుప్తా, గెల్లా కృష్ణారావు, రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, చారుగుళ్ల స్వాతి, కొత్తా కరుణ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



కూసుమంచి: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కూసుమంచి/ఖమ్మంఅర్బన్: అగ్నిప్రమాదాల నివారణపై కూసుమంచి, ఖమ్మం మమత మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ఆవరణలో శనివారం అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కూసుమంచిలో బస్టాండ్ సెంటర్‌లో ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో మంటలను ఆర్పే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే మమత కాలేజీలో అగ్నిమాపక అధికారులు వి.పాపయ్య, జయప్రకాష్, రిమాండ్‌బాబు, రాజేశ్వరరావు తదితరులు ప్రమాద సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమాల్లో మమత ఆస్పత్రి ఏఓ టీవీ బాబు, కాలేజీ అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు లారీ యజమానుల సంఘం ఎన్నికలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులో ఉన్న లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎన్నికల పోలింగ్ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష, కోశాధ్యక్ష పదవులకు ఇద్దరిద్దరు చొప్పున పోటీ పడుతుండగా.. 10 కార్యవర్గ సభ్యుల పదవులకు 13 మంది పోటీలో ఉన్నారు. మొత్తం 485 మంది సభ్యులతో పోలింగ్ ప్రక్రియ పూర్తికాగానే సాయంత్రం 4 గంటల తర్వాత ఫలితాలను ప్రకటిస్తామని ఎన్నికల అధికారి కొత్తా వెంకటేశ్వరరావు ప్రకటించారు.

బీటెక్ ఫలితాల్లో 'బొమ్మ' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో వైస్ చైర్మన్, అధ్యాపకులు

ఖమ్మంఅర్బన్: జేఎన్‌టీయూ ప్రకటించిన బీటెక్ మూడో సంవత్సరం ఫలితాల్లో నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శనివారం కాలేజీ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక 70శాతం మంది విద్యార్థులు 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందులో 86శాతం మార్కులతో కిలారు పూజ మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. విద్యార్థులను చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదారు శ్రీధర్, డైరెక్టర్ మాధవి, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డీన్ కలివర్థన్, హెచ్‌ఓడీ నగేష్ తదితరులు అభినందించారు.

హార్వెస్ట్‌కు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్(ఐఈఓ) తమ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించిన వారు మాట్లాడుతూ 329మంది బంగారు పతకాలు సాధించారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు రద్దు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపులను రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ గురుకుల సబ్ కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లకు వినతి పత్రాలు సమర్పించింది. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలల, కళాశాలల రాష్ట్ర కో-కన్వీనర్ లివింగ్‌స్టన్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపులను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల అంగీకారం లేకుండా బలవంతంగా క్యాంపులు నిర్వహించరాదని డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నామని, ప్రభుత్వం స్పందించకుంటే 20వ తేదీన సామూహిక సెలవు పెట్టి గురుకుల కార్యదర్శి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా గురుకుల బాధ్యులు అన్నమనాయుడు, స్వర్ణలత, గురుకుల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి చట్టం తేవాలి



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రెక్కాడితేనే డొక్కాడే వ్యవసాయ కార్మికులకి కేంద్ర ప్రభుత్వం చట్టం చేయకపోవడం శోచనీయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు మారినా వ్యవసాయ కార్మికుల బతుకులు మారలేదని, వారి సంక్షేమం కోసం వామపక్షాలు ఒత్తిడి తీసుకరావడంతోనే ఉపాధి హామీ చట్టం వచ్చిందని, దానిని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ పోడు పట్టాలు, సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా నాయకులు యర్రా శ్రీనివాస్, పొన్నెకంటి సంగయ్య, టి.రాధాకృష్ణ, వత్సవాయి జానకిరాములు, బందం రాజ్యం, కేవీరెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పక్షాన పోరాటం

ఖమ్మం మామిళ్లగూడెం: కారేపల్లి మండలం చీమలపాడులో జరిగిన మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో వారి తరఫున పోరాడుతామని జనసేన అసెంబ్లీ కోఆర్డినేటర్ మిర్యాల రామకృష్ణ తెలిపారు.ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు జగన్ మోహన్, రామచంద్రారావు, కార్తీక్, అజయ్, రామకృష్ణ, పుల్లారావు, విజయకుమారి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నేలకొండపల్లి: రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు అందించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సీవై.పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యంతో పాటుదరఖాస్తుదారులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీపై రూ.500 అందించాలని కోరారు. 12 రకాల నిత్యావసరాలు అందించే వరకూ ఉద్యమం సాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు కనకపూడి రవి, షకీలా, బి.భార్గవ్, రమేష్, పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయాన్ని రక్షించాలని ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అంబేడ్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా సీఐటీయూ ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయాన్ని రక్షించాలని కోరుతూ శనివారం సీపీఎం త్రీ టౌన్ కమిటీ నాయకులు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ..దేశ జనాభాలో 70 శాతం మందికి పైగా ఉన్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు దోపిడికి గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా నాయకులు బండారు యాకయ్య, వజినేపల్లి శ్రీనివాసరావు, ఐద్వా నాయకురాలు పత్తిపాక నాగసులోచన, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు, నాయకులు మద్దినత్యం, ఎర్ర మల్లికార్జున్, మండల వీరస్వామి, భూక్య సుభద్ర, పి.రయ్య తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో కనీస వసతులు కల్పించాలి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆవులఅశోక్ కోరారు. నగరంలోని ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కైకొండాయిగూడెం, దానవాయిగూడెం, రామన్నపేట, కొత్తగూడెం తదితర గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేసి ఏళ్ల గడుస్తున్నా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా, లైట్ల ఏర్పాటు జరగలేదన్నారు. ఇంటిపన్నులు మాత్రం కచ్చితంగా వసూలు చేస్తున్న అధికారులు వసతుల కల్పనలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజాపంథా నగర కార్యదర్శి బి.ఝాన్సీ, నాయకులు కె.శ్రీనివాస్, బొల్లి కొమరయ్య, రవి, చింతపల్లి ధరణి, కృష్ణ, చిలకల నర్సింహారావు, ములకలపల్లి లక్ష్మీనారాయణ, రామనాథం, జక్కుల వనిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదపుటంచున ప్రయాణం..!



నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో జనం కిక్కిరిసి మరీ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ వాహనంలో కుక్కినట్లు ఎక్కిస్తుండడం గమనార్హం. నగరంలో ఇలా కిక్కిరిసిన జనంతో వాహనాలు తిరుగుతున్నా ఆర్టీఏ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తే.. ఇలా అనుమతి లేని వాహనాలు తిరగవని, ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | ఖమ్మం-1 కె. సురేష్ - 9063199777
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 7997958225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు : ఎన్. నాగశేషు, మేనేజర్- 99122 20600

జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎన్. శేషయ్య - 99121 99148
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957
ఎన్. జయరాజు - 96528 68642